క్లుప్తంగా

గురుపౌర్ణమికి ముస్తాబైన ఆలయాలు



ఆలయంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

పులివెందుల టౌన్ : రేపు గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని షిర్డిసాయిబాబా ఆలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక పార్నపల్లెరోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయంలో చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో ముస్తాబుచేశారు. అన్నదానానికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటుచేశారు. ఆదివారం తెల్లవారు జామున బాబా విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించనున్నారు. అలాగే పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలోని షిర్డిసాయిబాబా ఆలయంలో, సాయికృప లేఅవుట్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో, మార్కెట్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లలితాదేవికి ఆషాఢమాస ఒడి బియ్యం సమర్పణ



ఒడి బియ్యం సమర్పించటానికి వచ్చిన మహిళలు

జమ్మలమడుగు : పట్టణంలోని జంబులింగేశ్వర ఆలయంలో లలితాదేవి అమ్మవారికి మహిళ సంఘం సభ్యులు అమ్మవారికి ఆషాఢమాసం ఒడి బియ్యం సమర్పించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారికి మహిళలు ఒడి బియ్యం సమర్పించారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వరరావు

సింహాద్రిపురం : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నిత్యావసర సరుకులు విక్రయించాలని తహసీల్దార్ భీమేశ్వరరావు తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన కిరాణా షాపు యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు ఉపయోగపడే నిత్యావసర సరుకులైన బియ్యం, కందిబేడలు, తదితర వస్తువులకు ప్రభుత్వం ఒక ధర నిర్ణయించిందని, ఆ ధర ప్రకారం విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో కిరాణా షాపు యజమానులు పాల్గొన్నారు.

కంపచెట్లను తొలగించండి



రోడ్డును కప్పేసిన కంపచెట్లు

పెద్దముడియం : మండలంలోని ఉప్పలూరు గ్రామసమీపాన రహదారిని కంపచెట్లు కప్పేయడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. కంపచెట్లు రోడ్డును కప్పేయడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

ఏరువాక గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



కూరగాయల అలంకరణలో గంగమ్మతల్లి

ఎర్రగుంట్ల : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో వెలసిన ఏరువాక గంగమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. అమ్మవారిని అన్ని రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించారు. భక్తులకు ఆల య కమిటీ నిర్వాహకులు అన్నదానం కార్యక్రమం ను నిర్వహించారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేయండి

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న సీఆర్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఎంటీఎస్‌ను అమలు చేసి న్యాయం చేయాలని కడప మండల సీఆర్‌పీలు కోరారు. ఈ విషయమై శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

కుష్టు వ్యాధి ముందస్తు గుర్తింపుతో నివారణ

- కుష్టువ్యాధిపై సర్వే ప్రారంభం
- ప్రత్యేక బృందాలతో ఇంటింటి ప్రచారం



శరీరంపై ఇలా మచ్చలు ఉంటే కుష్టు వ్యాధి

కుష్టు వ్యాధి సోకిన వారి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంటుంది. బాధితులు అందవిహీనంగా కనిపిస్తారు. కొంత మందికి రోగం ముదిరి చీము, నెత్తురు కారుతుంది. మరి కొందరికి శరీర బాగాలైన చేతి, కాలివేళ్లు కొరుక్కుని పోయి దివ్యాంగులుగా మారుతారు. ఈ వ్యాధికి కారణమైన సూక్ష్మక్రిములు వల్ల ఇంకొందరికి కాలు చేయి ఉండవు. ఇలాంటి వారు సమాజంలో మిగిలిన వారితో కలిసి పోలేక ఆత్మన్యూనతకు గురవతారు. ఒక వేళ కలిసి ఉందామన్నా సాటి మనుషులే దూరం పెడుతున్న సందర్భాలున్నాయి. దీంతో అత్యంత బాధాకర హృదయంతో ఊరికి దూరంగా నివాసం ఉండాల్సిన పరిస్థితి.

ఎర్రగుంట్ల : ఈ వ్యాధిగ్రస్తులు ప్రభుత్వ పథకాలే ఆధారంగా జీవిత మంతా భారంగా బతుకుబండిని లాగిస్తున్నారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే వైద్యం ద్వారా నయం చేయొచ్చు. లేకుంటే జబ్బు ముదిరి అంగవైకల్యం వచ్చే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు నేటి నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటి సర్వేకు శ్రీకారం చుడుతున్నారు.

బ్యాక్టీరియ ద్వారా ఇది వ్యాపిస్తుంది


హాన్సెన్స్ వ్యాధిగా పిలిచే కుష్టు వ్యాధి మైక్రోబ్యాక్టీరియం లెప్రే అనే సూక్ష్మజీవి ద్వారా శరీరంలో ప్రవేశిస్తుంది. ప్రధానంగా చర్మంపై ఇది ప్రభావం చూపుతుంది. పుండ్లు ఏర్పడుతాయి అంతేకాక మెదడు, వెన్నుపాయి వెలుపల ఉన్న నరాలను ప్రభావితం చేస్తుంది. కళ్లు, ముక్కులోపల ఈ బ్యాక్టీరియ చేరే అవకాశం ఉంది. కుష్టులో ట్యూబర్‌కులోయిడ్ లెప్రసీ, లెప్రోమాటస్ లెప్రసీ, బోర్డర్ లైన్ లెప్రసీ అనే రకాలు ఉన్నాయి.

ఈ వ్యాధి లక్షణాలిలా..

శరీరంపై కాస్త పెద్ద సైజులో నలుపు, లేత తెలుపు, రంగుల్లో మచ్చలుండి, అక్కడ గిల్లితే స్పర్శ లేక పోవడం లాంటి లక్షణాలుంటే తక్షణమే డాక్టర్‌ను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. జబ్బు ఉందని ప్రాథమికంగా గుర్తిస్తే చిన్న వైద్యంతోనే వ్యాధిని రాకుండా చూసుకోవచ్చు.

వ్యాధి వచ్చే అవకాశం ఇలా...

కుష్టు వ్యాధి అత్యంత బలహీనమైన అంటువ్యాధి. తుమ్మినా, దగ్గినా, గాలి ద్వారా పక్క వ్యక్తికి ఇది రావొచ్చు. శరీర ద్రవాల ద్వారా ఇంకో వ్యక్తికి వచ్చే అవకాశముంది. అయితే ఈ వ్యాధి అంత త్వరగా ఒకరి నుంచి మరొకరికి సోకదు. దీర్ఘకాలికంగా కుష్టు వ్యాధి ఉన్న వ్యక్తితో సన్నిహితంగా కలిసి ఉంటేనే వస్తుంది. ఇలా సోకి వారిలో త్వరగా బయట పడదు. మూడు నుంచి ఐదేళ్ల కాలం పట్టొచ్చు. ఈ వ్యాధి జిల్లా వ్యాప్తంది 96 మంది వ్యాధిగ్రస్తులున్నారు. ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో ఇద్దరు మాత్రమే ఉన్నారు.



లెప్రసీ లోగో

సర్వేకు సహకరించి విజయవతం చేయండి..



ఆరోగ్య రక్షణ చర్యల వల్ల జిల్లాలో కుష్టు వ్యాధి చాలా వరకు నియంత్రణలోకి వచ్చింది. అతి తక్కువ కేసులు మాత్రమే ఉన్నాయి. సర్వేకు ప్రజలు సహకరించి విజయవంతం చేయాలి. శరీరంపై ఎక్కడైనా నల్లటి లేత తెలుపు తేనె రాగి తదితర రంగుల్లో పెద్ద మచ్చలుండి స్పర్శ లేకుంటే సర్వే సభ్యులకు సమాచారం ఇవ్వాలి. వారు పరిశీలించి వైద్య సాయం అందిస్తారు.

– వీరభద్రయ్య, డిప్యూటీ పారామెడికల్ అధికారి, ఎర్రగుంట్ల

ప్రత్యేక బృందాలుగా సర్వే..



కుష్టు వ్యాధిపై ఎర్రగుంట్ల పీహెచ్‌సీ పరిధిలో ప్రత్యేక బృందలుగా ఏర్పడి సర్వే చేస్తున్నాం. వారిలో ఆశా కార్యకర్త, సిబ్బంది వైద్య సిబ్బంది ఉంటారు. ఆగస్టు 2వ తేదీ వరకు ఈ సర్వే జరగనుంది. ప్రతి ఇంటిలో ప్రతి మనిషిని సర్వే చేయనున్నారు. ఎక్కడైన స్పర్శలేని మచ్చలున్నట్లు గుర్తిస్తే పీహెచ్‌సీ వైద్యాధికారి ద్వారా పర్యవేక్షణలో ఉంచి వైద్య పరీక్షలు అందిస్తారం

– ఓబులేసు, నోడల్ అధికారి, ఎర్రగుంట్ల

సమతుల ఆహారంతో మంచి ఆరోగ్యం

పులివెందుల టౌన్ : సమతుల ఆహారం తీసుకోవడం ద్వారానే మంచి ఆరోగ్యం లభిస్తుందని లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ తెలిపారు. స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు బేసిక్స్ ఆఫ్ న్యూట్రిషన్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారంలోని పోషకాలు, వాటి విలువలు, సమతుల ఆహారం, పోషణ–వ్యాధులు అనేక అంశాలపై వివరించారు. ప్రస్తుత కాలంలో విద్యార్థినులు, గృహిణులు రక్త హీనత వ్యాధితో బాదపడుతున్నారన్నారు. వాటిని అధిగమించడానికి మంచి సమతుల ఆహారం, ఐరన్ వంటి పదార్థాలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సమాజంలో ఇతరులకు కూడా వీటి ఆవస్యకతలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆరోక్యస్వామి, జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఉదయ్‌కిరణ్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.వి.సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డి వాముల దగ్ధంపై కేసు నమోదు

పెద్దముడియం : మండలంలోని బోదుతిప్పలపాడు గ్రామంలో రెండు రోజుల క్రితం ప్రసాద్‌రెడ్డి అనే రైతుకు చెందిన నాలుగు గడ్డి వాములు కాలిపోయిన సంఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. కాలిపోయిన గడ్డి వాముల విలువ రూ.2 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు.

పోక్సో చట్టం పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి లక్ష్మి

జమ్మలమడుగు : మహిళల, చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నివారించాలంటే పోక్సో చట్టం పటిష్టంగా అమలు చేయాలని శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి డి.లక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుల, రెవెన్యూ, పోలీసు అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర సంస్థలలో పదిమంది కంటే ఎక్కువ మంది కలిసి పనిచేసే సంస్థలలో యాజమాన్యాలు ఇంటర్నల్ ఫిర్యాదుల పెట్టెను అమలు చేయాలన్నారు. అలా అమలు చేయడం ద్వారా తమకు ఎవరితో ఇబ్బందులు ఉన్నాయో మహిళలు తెలుపుతారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలను నిర్వహించాలన్నారు. ఆదేవిధంగా వేధింపులకు గురి అయ్యే మహిళలు స్థానిక మున్సిపల్ కమిషనర్, మండలస్థాయిలో తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేయవచ్చు అని ఆమె సూచించారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ చట్టలను ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో అమలు పరచాలన్నారు. గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ఆ కమిటీల ద్వారా వేధింపులకు గురి అయ్యేవారిని కాపాడుకోవచ్చు అని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్పీ మురళీధర్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, సీడీపీఓ, ఎంపీడీఓలు, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



చెన్నంరాజుపల్లె గ్రామ పొలాల్లో పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తే లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని చెన్నంరాజుపల్లె పొలాల్లో రైతు నాగేశ్వర్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పత్తి పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. పత్తి పంటకు పచ్చదోమ, పెనుబంక తెగుళ్ల రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వాటి నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన నీమాస్త్రంను పిచికారి చేయాలన్నారు. అలాగే దోమ నివారణకు పసువు, తెలుపు పల్లాలు, పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగిరియంపల్లె గ్రామంలో నాగారత్నమ్మ వేసిన సూర్య మండలం మోడల్ 22 రకాల ఆకు కూరలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రామకృష్ణమరాజు, ఏఓ ఓబులేసు పాల్గొన్నారు.

గ్రామాల్లో తిరిగి సమస్యలు గుర్తించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు రూరల్ : ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించుకోవడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గుద్దేటి హరిత అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని గొరిగెనూరు, పి.సుగుమంచిపల్లె, పెద్దండ్లూరు, మోరగుడి, గూడెంచెరువు, గండికోట, చిటిమిటిచింతల గ్రామాల్లో ఉన్న పలు సమస్యలపై ప్రజా ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల ఎంపీడీఓ పి.ముజఫర్ రహీం, పంచాయతీరాజ్ డీఈ విజయభాస్కర్‌రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను వృద్ధి చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని మెప్మా సంస్థలో ఉన్న పొదుపు సంఘాలను వృద్ధి చేయాలని అలాగే ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సంఘం సభ్యులకు అందించడంలో ఆర్పీలు కీలక పాత్ర పోషించాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన మెప్మా సంస్థ టీఎంసీ, సీఓ, ఆర్పీలతో ఆయన కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలకు రుణాల మంజూరులో సభ్యుల వద్ద నుంచి డబ్బులు తీసుకోకూడదన్నారు. అలా తీసుకుంటే సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్పీలపై చర్యలు తీసుకోబడతాయన్నారు. అయితే ఇటీవల ఆర్పీల పనితీరుపై ఫిర్యాదు రావడంతో విచారణ చేశామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి అవకతవకలు రాలేదన్నారు. పలువురు ఆర్పీలు మాట్లాడుతూ మాకు రెండు నెలలుగా జీతాలు రాలేదన్నారు. ఆర్పీలందరు మహిళలే అని మెప్మా సీఓలు, అధికారులు చెప్పిన మేరకు మేము పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ ఎదుట వాపోయ్యారు. మెప్మా టీఎంసీ, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

గోకుల్ మిషన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కోనాయపల్లెలో పశువులకు చికిత్స చేస్తున్న పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు రమణయ్య

పెండ్లిమర్రి : పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు రమణయ్య తెలిపారు. మండలంలోని కోనాయపల్లె, ఎరాసుపల్లె గ్రామాల్లో శుక్రవారం పశువుల్లో గర్భకోశ వ్యాధుల గురించి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

లంపిస్కిన్, గొంతు వాపు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రమేష్, శ్రీధర్‌లింగారెడ్డి, పశువైద్యాధికారిలు సురేష్‌రెడ్డి, శివరామిరెడ్డిలు పాల్గొన్నారు.

21న రక్తదాన శిబిరం

కమలాపురం : రక్త వారోత్సవాల్లో భాగంగా ఈనెల 21వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్‌కుమార్ తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో రక్త వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కమలాపురంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో విషపూరిత జ్వరాలు, మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్న కారణంగా జిల్లాలోని రక్తనిధి కేంద్రాల్లో రక్త నిల్వలు తగ్గిపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో యువతీ యువకులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, రక్తదాతలు ఈ రక్తదాన శిబిరానికి స్వచ్ఛందంగా తరలి వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో ఓ ప్రైవేటు స్కూల్‌లోని విద్యార్థులకు కుష్టువ్యాధి లక్షణాలు, దానికి చికిత్స విధానంపై చిలంకూరు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి శుక్రవారం అవగాహన కల్పించారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు : ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని రాయలసీమ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి పామిలేటి శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం పుస్తకాలతోపాటు, నోట్ పుస్తకాలను కూడా తమ పాఠశాలలోనే తీసుకోవాలంటూ విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. మార్కెట్ రేటు కాకుండా అంతకంటే ఎక్కువ రేట్లతో పుస్తకాలు కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సేవాసమితి నూతన భవనానికి విరాళాలు

పులివెందుల టౌన్ : పులివెందుల నియోజకవర్గ స్థాయిలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి గత 15 సంవత్సరాలుగా విద్య, వైద్య, పర్యావరణ రంగాలతో పాటు అన్ని సామాజిక కార్యక్రమాల్లో సేవలు అందిస్తోంది. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవాసమితి సేవలకు మెచ్చిన పెరుమాళ్ల రాజేష్‌గుప్తా సేవా సమితి అభివృద్ధి కోసం సొంత భవన నిర్మాణం కోసం విరాళాల సేకరణకు సహకరించారు. చదువులకు వెళ్లాలనే విద్యార్థులకు ఉచిత కోచింగ్, నిరుద్యోగ యువతకు, మహిళలకు స్వయం ఉపాధి కొరకు శిక్షణ కార్యక్రమాలతో పాటు నేత్రసేకరణ సేవలందిస్తూ వస్తోంది. ఇందుకు సంబంధించి సొంత భవన నిర్మాణం చేసుకునేందుకు విరాళాలు సేకరిస్తున్నట్లు సేవాసమితి సభ్యులు తెలిపారు. దాతలు ఇచ్చే విరాళాలకు 100 శాతం పన్ను రాయితీ వర్తిస్తుందని, విరాళాలు అందించాలనుకున్న దాతలు 9966509364 నెంబరును సంప్రదించాలన్నారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయండి



స్పీడు బ్రేకర్ ఏర్పాటు చేయాల్సిన రోడ్డు

పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సర్వజన ఆసుపత్రి ముందు ఉన్న రోడ్డులో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆసుపత్రికి వచ్చే ప్రజలు కోరుతున్నారు. స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో కడప, వేంపల్లె నుంచి పులివెందుల వచ్చే వాహనాలు వేగంగా వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మూడు రోజుల క్రితం పులివెందుల నుంచి మెడికల్ కళాశాలకు ద్విచక్రవాహనంలో వస్తున్న ఇద్దరిని క్యాంపర్ ఢీ కొనడంతో మృతి చెందిన విషయం విధితమే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు సర్వజన ఆసుపత్రి ముందు ఉన్న రోడ్డులో స్పీడు బ్రేకర్‌ను ఏర్పాటు చేసి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అంటున్నారు.

పరిశుభ్రతతో దోమలను నివారిద్దాం



మురుగునీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



మురుగు కాలువలో మందులను పిచికారీ చేయిస్తున్న ఎంపీడీఓ సాల్మన్ రాజ్

పులివెందుల టౌన్ : పరిసరాల పరిశుభ్రతతో దోమలను నివారిద్దామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా దోమల నివారణ, పరిశుభ్రత కోసం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన శానిటరీ సెక్రటరీలతో కలసి పూలంగళ్ల సమీపంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పర్యవేక్షించి మాట్లాడారు. ఇళ్లలో వాడే ఫ్రిజ్జులు, పూల కుండీలు, ఖాళీ కొబ్బరి బోండాలలో చేరే నీరు వంటి వాటిలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండే ఆ నీటిలో లార్వా వృద్ధి చెంది దోమలు తయారవుతాయన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే కలుషిత నీరు, ఆహారం వలన టైఫాయిడ్, డయేరియా వ్యాధులు వస్తాయని ప్రజలు పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ముద్దనూరు రోడ్డులో ఉన్న డబ్ల్యూటీపీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటును సందర్శించి మంచినీరు క్లోరినేషన్ చేసి ఇంటింటికి సరఫరా అయ్యే విధంగా చూడాలన్నారు. సురక్షిత మంచినీరు సరఫరా చేయడం కోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాటర్ టెస్టింగ్‌లు కూడా విధిగా చేయాలని సంబంధిత ఏఈలను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది పట్టణంలో ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

డయేరియాను అరికట్టవచ్చు...

సింహాద్రిపురం : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం కాపాడుకోవడంతో పాటు డయేరియాను అరికట్టవచ్చని ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ తెలిపారు. శుక్రవారం సింహాద్రిపురం, పైడిపాలెం, సుంకేసుల గ్రామాల్లోని ప్రజలకు ఆయన పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించి మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా ఎక్కడ మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మురుగు నీటిలో దోమలు వ్యాప్తి చెందుతాయని, దోమలు కుట్టడం ద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధులు వస్తాయన్నారు. అలాగే తాగు నీటిని వేడిచేసి చల్లార్చి తాగాలని సూచించారు. కార్యక్రమంలో యూపీఆర్డీ పద్మనాభరెడ్డి, ఆయా సచివాలయాల పంచాయతీ సెక్రటరీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ, పోలీసు సిబ్బంది

చెన్నూరు : రోడ్డు ప్రమాదాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ నారాయణ యాదవ్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి కొత్తరోడ్డు వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కలిప్పించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం తలకు బలమైన గాయాలు తగలడంతోనే మరణించారన్నారు. అలాగే ప్యారా లీగల్ వలంటీర్లు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని వినూత్న రీతిలో ద్విచక్ర వాహనదారులకు రోజా పూలు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌ఈడీసీ ఎస్.శాంత, పారా లీగల్ వలంటీర్ దశరథరామిరెడ్డి, ఏఎస్ఐ ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన మస్తాన్‌స్వామి పీరు ఉత్సవం



గ్రామోత్సవంలో మస్తాను పీరు ఉత్సవం

పులివెందుల టౌన్ : పట్టణంలో మస్తాన్‌స్వామి పీరు ఉత్సవం శుక్రవారం ఘనంగా ముగిసింది. మస్తానుస్వామి పీరును జెండామాను వీధిలోని పీర్ల చావిడి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. కొంతమంది భక్తులు వెండిగొడుగులు చేయించి తమ మొక్కులు తీర్చుకున్నారు. చెక్కర చదివింపులు ఇచ్చాక అందరికి పంచిపెట్టారు. జెండామాను వీధి నుంచి గాడిచర్ల వీధి, అమ్మవారిశాల, మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్ మీదుగా పీర్ల ఉత్సవం జరిగింది. అలాగే శనివారం నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఉన్న భవాణి పీరు ఉత్సవం మొదలు కానుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశారు. అగ్నిగుండ ప్రవేశానికి అగ్నిగుండం తవ్వారు. చావిడిలో పీర్లను కొలువుతీర్చారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని కసునూరు గ్రామంలో మాబు స్వామి పీర్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువకులు పోటీపడి విచిత్ర వేషాలు వేసుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ఈ వేడుకలు జరుపకపోవడంతో ఈ ఏడాది నిర్వాహకులు పీర్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కసునూరు, సింహాద్రిపురం, గురిజాలలో మస్తాన్‌స్వామి ఉత్సవ పీర్ల జలసమాధి కార్యక్రమం నిర్వహించారు. సింహాద్రిపురం ఖాదరవల్లిస్వామి ఉత్సవ పీరు వేడుకలు శుక్రవారం ప్రారంభమై శనివారంతో ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వ్యవసాయ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ సంఘం నాయకులు

ఎర్రగుంట్ల : వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులను ఆదుకుని వారికి నష్టపరిహారం అందించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ తేజశ్వనికి వినతిపత్రం అందజేశారు. 2023 సంవత్సరం కరువు, తుఫాన్‌లతో దెబ్బతిన్న పంటలకు బీమా పరిహారం రైతుల ఖాతాలలో వేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలను బలపరచాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం మండల నాయకుడు మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

జర్నలిజం పరీక్షలు తనిఖీ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జర్నలిజం అనుబంధ కోర్సులైన పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్స్, పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ తెలుగు జర్నలిజం పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన పరీక్షను వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్‌లను, నామినల్‌రోల్స్‌ను పరిశీలించారు. జర్నలిజం శాఖ విభాగాధిపతి తమ్మినేని శ్యామ్‌స్వరూప్ పర్యవేక్షణలో వైవీయూ ఆర్ట్స్‌బ్లాక్‌లో ఈనెల 15వ తేదీ నుంచి పరీక్షలు జరుగుతున్నాయి.